ఊహనగరి ప్రజాస్వామ్యం

# పుర-పాలక సంఘం

వడ్లపట్ల దయానందం

హుటాహుటీగా సభ్యులకు 'అజండా' కాగితాలందజేయబడినై. మొత్తం రెండు పరకల మంది సభ్యుల్లోను దాదాపు ముప్పావు డజను మంది కాగితాలు పుచ్చుకొని చదువుకున్న వాళ్ళ కోసం తడుముళ్ళాటలో పడ్డారు. అత్యవసర సమావేశం, ఆ మర్నాటికేనన్న విషయం సభ్యుల్ని మరీ హడావిడి పెట్టింది.

మొత్తంమీద "ఊహానగరి" అంతా అట్టుడికి నట్లుడికి పోతోంది. సమస్య ఏ పెడగా పరిష్కరించబడినా ఊహానగరిలో చిచ్చుపుట్టడం తథ్యం. నలుగురు చేరిన ప్రతీచోటా ఈ విషయమే చర్చనీయాంశమై కూర్చుంది. ఊహానగరిలోని అన్ని "చిల్లర మల్లర" రాజకీయ ముఠాలు కలసి టోకుగా రెండై ఈ సమస్యను చెరివై పునపట్టి లాగటం వల్లనే అత్యల్పవ్యవధిలోనే, అత్యున్నత స్థానాన్నందుకుని రివ్వున తారాపథాని కెగసింది సమస్య.

ప్రతిపక్ష కౌన్సిలర్ తవిటయ్య మేనల్లుడే ఆ స్థలానికి ముందుగా అప్లికేషన్ పెట్టడానిన్నీ గౌరవనీయులైన ఉపాధ్యక్షుల బావమరిది అనుంగు సహచరుడు సదరు 'వారి' బావమరిదిద్వారా అధ్యక్షోపాధ్యక్షుల వత్తాసుతో ఆస్థలాన్ని కాస్తా తన పేర శాంక్షన్ చేయించుకుని, కిళ్ళీకొట్టు పెట్టేశాడనిన్నీ తవిటయ్య మేనల్లుడైన ఎరుకయ్యకు జరిగిన అన్యాయాన్ని అరికట్టేభారం కేవలం ప్రతిపక్షీయుల భుజస్కంధాపైనే కాక, ప్రజపైకూడా పడిందనిన్నీ బహిరంగ సభలద్వారా ఉద్ఘాటిస్తున్నారు ప్రతిపక్షీయులు. సదరు ఉద్ఘాటనలకయ్యే 'చమురు' నిమిత్తం ఎరుకయ్యాయిల్లు కుదువకు వెళ్ళిందన్నది, అధికార పక్షీయ దుష్ప్రచారం తప్పితే అందులో ఏమాత్రం సత్యం లేదన్న విషయాన్నికూడా ప్రతి బహిరంగ సభలోనూ ఉటంకిస్తున్నారు.

అధికార పక్షంలోఉన్న ఒక చిన్న నాయకునికికూడా, ఎరుకయ్య దూరపుబంధువు కావడం వల్ల పార్టీ క్రమశిక్షణ పేరుతో బంధుత్వాన్ని కాదనలేనని, మరో ఇద్దరు సహచరులతో సహా ఎదురు తిరగబోతున్నాడన్న విషయం అధికార వర్గానికి ముచ్చెమటలు పట్టించింది. అసలే లాటరీలో వచ్చిన చైర్మన్‌గారు ఆశలుచూపించి మరో ఇద్దర్ని తమ పక్షంవైపుకు మళ్ళించుకుని నిరాఘాటంగా పురపాలన సాగిస్తున్నారు.

"ఈ ఒక్క విషయంలోనూ బంధువని చూచుకోగానే సరికాదు, భవిష్యత్ కూడా ఆలోచించుకో మన"మని ఎదురు తిరిగిన సభ్యులకు హితులతో చెప్పించినా ఫలితం కనిపించకపోగా, మీదుమిక్కిలి సదరు సభ్యులు పార్టీ క్రమశిక్షణాబంధాలను త్రెంచుకోడానికి అభేద్యమైన నిర్ణయం చేసుకున్నారన్నది తలనెరిసిన పట్టుబ్రర చైర్మన్‌గారిని సైతం సందిగ్ధావస్థలోకి పడదోసింది.

ఏదెలాఉన్నా చైర్మన్, వైస్ చైర్మన్ వత్తాసుతో జరిగిన ఈ విషయాన్ని కౌన్సిల్లో నెగ్గించుకోలేని పక్షంలో రాజీనామాలన్నా చేసి పారేస్తాంగాని, ప్రతిపక్షీయులకు లొంగటం అన్నమాట మాత్రం కల్లని చైర్మన్‌గారు పబ్లీకుగా బజారులోనే శపథాలు చేస్తున్నారు.

"ఒకవేళ అధికారపక్షంవారు ఏవైనా ఎత్తులు వేసి తమ తీర్మానాన్ని నెగ్గించుకునే పక్షంలో సత్యాగ్రహంద్వారా అసలు పురపాలననే స్థంభింప చేస్తాం" అని ఏకంగా కరపత్రాన్నే అచ్చేయించి ఊరిమీదికి విరజిమ్మారు ప్రతి పక్షీయులు.

ఆ రోజే సమావేశం పర్యవసానంకోసం ఎదురు చూస్తున్న ప్రజలుకూడా తహ తహ లాడారు సమావేశం ఏర్పాటుకోసం.

సమావేశం కాలానికి ఒక గంట ముందుగానే సభ్యులందరూ హాజరయ్యారు. ఇరుపక్షాలకు సంబ

ధించిన ప్రజలుకూడా ప్రేక్షకులుగా హాజర య్యారు. టైమిట్టే గడచి గంటకాలం దొర్లిపోయింది. 'వ్రాలు' సభ్యులందరు సంతకాలు, గౌరవ నీయులైన నిశానీదార్లు వేలుముద్రలువేసని అనంతరం కూర్చీల్లో బైటాయించారు. ప్రేక్షక ప్రజలంతా హాలుకు నలువైపులా క్రిక్కిరిసి ఉన్నారు. చైర్మన్‌గారు చిఋతపులితోలు కప్పిన మధ్యనున్న ఉన్నతాసనంపై ఆశీనులైయ్యారు.

చైర్మన్‌గారి ముఖం, కళగా ఉండటం అందరికీ ఆశ్చర్యం కల్గించింది. ముద్దపెదిమలపై చిరునవ్వు చిందులాడుతోంది. నిండు విగ్రహం, విశాలమైన నుదురు కొట్టొచ్చినట్లుంటే ముక్కు బట్టతల పూర్వకాలంలో ఘోర్తుఘారంవరకు చదివిన చదువును పురస్కరించుకొని, అపుడపుడూ ఇంగ్లీషుపదాలను వదలతూ చాలా హుందాగా కన్పిస్తారు.

విమర్శకులలో కొంద రాయన్ని "కన్నింగ్–జాకాల్" అంటూ ఉంటారు. మరికొందరు, "పరిపాలనాదక్షుల కుండవలసిన లక్షణమే అది" అని అంటూంటారు.

అసలాయన 1937 సంవత్సరం ఆ ప్రాంతంలో పక్కు జస్టిన్‌పార్టీ సోల్జరు. "రాజకీయ పార్టీలంటే నాకు మహాచెడ్డ చిరా" కంటూ, మొత్తం ఇరవై ఎనిమిదిమంది కౌన్సిలర్సుగల మునిసిపాలిటీలో ఐదుగురు స్వతంత్రులను కూడగట్టుకొని పూర్తి మెజారిటీ తెచ్చుకోలేని రాజకీయపార్టీలమధ్య మూడు మునిసిపాలిటీల 'తరా'లనుంచి, నిరాఘాటంగా చైర్మన్ గిరీ వెలిగిస్తున్నారు. ఇపుడు సంభవించినటువంటి గడ్డు సమస్యల నెన్నింటినో ఇదివరలో అవలీలగా దాటేశారు. ఆయన కిది ఒక లెక్కలోనిది కాదని ఆయన సన్నిహితులకు తెలుసు. "పూర్తి మెజారిటీ ఉంటే ఎవడైనా పరిపాలించవచ్చోయ్. కాని ఐదుగురుతో ఇరవై ఎనిమిదిమంది సభ్యులుగల భవనంలో అధికారం చెలాయించటను ఎవరికైనా" అంటూ సగర్వంగా సన్నిహితులతో తరచూ అంటూఉంటా రాయన.

చిన్న దగ్గు దగ్గి, సమావేశాన్ని ప్రారంభించారు. ఎజండాలోని అన్ని అంశాలని గుమాస్తా గడగడ చదువుకుపోతూంటే, "యునానిమస్లీ పాస్‌డ్" అంటూ మినిట్సు బుక్కులో వ్రాసుకు పోతున్నారు చైర్మన్‌గారు. ఆఖరు అంశం, కిళ్ళీ కొట్టు స్థలానిది చదవబడింది, ఒక్కసారిగా అన్ని కంఠాలనుండి జివ్వు జివ్వుని శబ్దబంయటపడి, అంతలోనేఅతి నిశబ్దత ఏర్పడింది.

ప్రతిపక్ష కౌన్సిలర్ తవిటయ్య లేచి, ఏదో ఆవేశంగా మాట్లాడబోయాడు. "ఆవేశాలు కూడదు. చర్చ సరళస్థాయిలోనే కానివ్వం"డన్న చైర్మన్‌గారి అభ్యర్థనని పురస్కరించుకుని ఆవేశాన్ని దిగమింగి అర్థగంటసేపు అనర్గళ ఉపన్యాసంచేస్తూ దానిలో అధికార పక్షీయులు నిరంకుశత్వాన్ని నిరసిస్తూ, కమీషనర్ చర్యను గుర్తించి కూర్చున్నాడు తవిటయ్య.

"ఇది ఉపన్యాస వేదిక కాదు. ప్రతి సభ్యుడూ అరగంటలకొలదీ ఉపన్యాసాలుచేస్తే టైం చాలదు. కనుక చర్చకు సంబంధించినంతవరకు క్లుప్తంగా అభిప్రాయిస్తారని ఆశిస్తున్నా"నంటూ కౌన్సిల్‌కొక అప్పీలుచేసుకున్నారు చైర్మన్‌గారు. అనంతరం ఒకరికంటె ఒకరు అధికార పక్ష నిరంకుశత్వాన్ని తీవ్రాతితీవ్రంగా నిరసించేసి నీరసంగా కూలబడ్డారు ప్రతిపక్ష బ్లాకులో.

ప్రతిపక్షీయులు తెలియజేసే నిరసనలో అర్థం లేదంటూ మృదువైన మందలింపుధోరణిలో మాట్లాడింది అధికారపక్షం.

ఓటింగ్‌కు గంటకొట్టారు.

అధికారపక్ష తీర్మానం నెగ్గింది.

ప్రతిపక్షం వోడింది.

అధికారపక్షంలోని కొందరు సభ్యులు ప్రతిపక్షంవారితో కలిసి చేతులెత్తినా, తీర్మానం ఎలా నెగ్గిందా అన్న తికమకలోపడ్డ ప్రేక్షకులు, కౌన్సిలర్సు కూడా ఒకరిముఖాలవంక ఒకరు చూసుకున్నారు ఆశ్చర్యంతో.

తటస్థులుగా ఉండిపోయిన నలుగురు ప్రతిపక్ష సభ్యులు గొల్లున నవ్వారు.

చైర్మన్‌గారు మళ్ళా ఒక్కసారి హుందాగా నవ్వేసి ఠీవిగా పట్టుబ్రుకను చేతితో సవరించుకున్నారు.